# సింగిల్ పేజీ కథలు

## విశ్వాసం

మా అద్దెయింటి వాకిట్లో ఎప్పుడూ పడుకొని ఉంటుంది ఓ కుక్క. అది పెంపుడు కుక్కా? కాదు. దాన్ని చూస్తే నాకు ఒహటే కంపరం.

'పారిశ్రామిక కార్మికులూ-నీతినిజాయితీలూ' అన్న అంశంపై వ్యాసం రాస్తున్నాను. మా యూనియన్ సెంట్రల్ కమిటీ నిర్వహణలో నెల నెలా ప్రచురించే మాగ్‌జైన్‌కి ఈ వ్యాసం త్వరగా పంపించాలి. ఈ వ్యాసానికి సంబంధించిన మెటీరియల్ కోసం రకరకాల పుస్తకాలూ, లేబర్ లాస్ లాటివెన్నో చిందరవందరగా పడున్నాయి నా ముందు.

ఈ కుక్క నన్ను అలాగే తీక్షణంగా చూస్తుంది. అది నా వంకే చూస్తూ ఉండటం చిరాకెత్తిపోతుంది.

రాష్ట్రంలో రాష్ట్రానికి చెందిన ఓ పెద్ద పరిశ్రమలో అయిదువందలమంది కార్మికోద్యోగులున్న బ్రాంచిలో రికగ్నైజ్డ్ యూనియన్‌కి ప్రెసిడెంట్‌ను నేను.

ఇంతలో-

"కుళాయి వెళ్లిపోయేటట్టుంది- కాస్త ఆ కిచెన్ వేపు చూస్తుండండి. అదిగో ఆ కుక్క యిక్కడే చచ్చింది" అంటూ బిందె పట్టుకొని పరుగులాటి నడకతో కుళాయిదగ్గరకు పరుగెత్తింది మా ఆవిడ.

మా ఆరేళ్ల అమ్మాయి ప్రజ్వలని కాన్వెంటుకి తయారుచేసి రిక్షా ఎక్కించేసరికి, కుళాయి నీళ్లు వెళ్లిపోతుంటాయి.

సరిగ్గా అప్పుడే మా యూనియన్‌కి సంబంధించిన గారేజీ యాక్టివ్ వర్కర్స్ కొంపలు మునిగాయంటూ వచ్చారు.

మార్క్స్, ఏంగిల్స్, స్టాలిన్, లెనిన్ లాంటి మహామహుల పుస్తకాలు చదివాను. కార్మిక నాయకుడిగా ఎలాగైనా ఎదగాలన్నదే నా వాంఛ. కార్మిక సమస్యల గురించి రీజియన్‌లో నిర్వహించే మహాసభల్లో నా ఉపన్యాసం ఉండి తీరాల్సిందే. నా ఉపన్యాసం కోసం పెద్దయెత్తున కార్మికులు తరలివస్తుంటారు. నా ఉపన్యాసానికి చప్పట్లూ, విజిల్సూ చెప్పనలవి కాదు. కార్మికుణ్ణి ఆవేశపూరితుణ్ణి చేయగల సత్తా ఉంది నాకు. ట్రేడ్ యూనియన్స్‌లో కార్మికుల సమస్యలపై యాజమాన్యాన్ని ఉతికి ఆరెయ్యగలను. ఎదుటి యూనియన్ తప్పుల్ని ఉతికి ఆరెయ్యగల సామర్థ్యం సంపాయించుకొన్నాను.


రాస్తున్నది ఆపి వాళ్లను పలకరించాను.

"ప్రతాప్‌గారూ! రాత్రి మన ఫ్యాక్టరీలో దొంగతనం జరిగింది" అన్నాడు మెకానిక్ జగన్నాథం.

నేను ఆఫ్‌లో ఉన్నాను. దాంతో పాతవి రెండు 'సీ' ఆఫ్‌లు తీసుకోవడం వలన డ్యూటీకి వెళ్లలేదు.

దొంతనం చేసింది మా యూనియన్ వాళ్లేనని తెలిసేసరికి సమస్య అర్థమయింది. ఎలా జరిగిందని ప్రశ్నించాను.

"స్టోర్ రూం తాళం కప్పలు బద్దలుగొట్టి పంప్ సెట్లూ, మోటార్లు గోడవతలకెక్కించి పట్టుకుపోతూంటే, సెంట్రీలో ఉన్న సెక్యూరిటీ వాళ్లు పట్టుకున్నారు. మన వాళ్లని పోలీస్‌స్టేషన్లో అప్పగించారు. మీరొచ్చి ఇన్‌స్పెక్టర్‌తో మాట్లాడితే, మనం ఈ కేసులోంచి బయటపడొచ్చు..లేకపోతే రైవల్ యూనియన్ వాళ్లకు లోకువయ్యిపోతాం" అన్నారు.



యూనియన్‌పై మచ్చ రాకూడదు. అలా వస్తే సభ్యులు అవతల యూనియన్లలోకి దాటిపోతారు. కనుక ఎఫ్.ఐ.ఆర్ తయారుకాకముందే పోలీసుల్ని మానేజ్ చెయ్యాలి. దానికి మార్గాలున్నాయి. నా బుర్రలో ఆ పథకం సాలెగూడులా అల్లుకోవడం ప్రారంభమయ్యింది.

మా ఆవిడ కుళాయి దగ్గర్నుంచి నీళ్ల బిందెతో చెమట్లు కక్కుకుంటూ వచ్చింది.

వరండాలో మా యూనియన్ సభ్యులు పిచ్చాపాటీ మాట్లాడుకుంటున్నారు.

నేను నా రాత పని కట్టేసి బట్టలేసుకునేందుకు లోపలికెళ్లాను.

కిచెన్‌రూంకి ముందు కుక్క పడుకొని ఉంది.

"ఏమండీ..లోపల వంటా కూరలూ ఉన్నాయి. కుక్కగాని లోపలికెళ్లిందేంటి?" అడిగింది కంగారుగా.

ఆవిడకంటే పోలీసుకేసుని ఎలా చేధించాలానని నాకే కంగారుగా ఉంది.

"చెల్లమ్మా! యింటి ముందు నుయ్యి ఉందిగా, ఆ నీళ్ళు తాగడానికి పనికిరావా, కుళాయినీళ్లు తెస్తున్నావు?" అని ప్రశ్నించాడు ఆ నలుగుర్లో ఒకడైన పల్లంరాజు.

"నూతినీళ్లు కాస్త ఉప్పగా ఉంటాయన్నయ్యా-నీళ్ళకో, పాలకో బయటికెళ్లాలంటే ఈ మాయదారి కుక్క చంపుకు తినేస్తుందంటే నమ్మన్నయ్యా..యెక్కడినుంచి వచ్చిందో, మా కొంప వదల్టం లేదు" అంది చిరాగ్గా.

"బాగా కక్కా ముక్కా రుచి గట్టిందేమో" అన్నాడు మరో సభ్యుడు.

అసలా కుక్క యెలా చేరిందో యేమిటో! ఎప్పుడూ మా యింటి దగ్గరే ఉంటోంది గత రెండు మూడు నెలల్నుంచీనూ. మా అమ్మాయి ప్రజ్వల తినిపారేసినవీ, తినగా మిగిలిన ఎంగిళ్లూ, చేపముళ్లూ చెత్తా చెదారం తప్ప దానికంటూ తింటానికి యెప్పుడూ నేను కాని, మా ఆవిడ కాని నాలుగు మెతుకులు విదపలేదు.

నేను లోపల డ్రస్సు వేసుకుంటూ అన్నీ వింటున్నాను.

"చూడన్నయ్యా! ఈ కుక్కతో మాకు పెద్ద చావొచ్చి పడింది. ఎప్పుడు లోనకెళ్లి ఏం తినేసిపోతాదోనని భయంగా ఉంది" అంది మా ఆవిడ.

"దొంగకుక్కా అమ్మా?" మెకానిక్ జగన్నాథం అడిగాడు.

ఇంతవరకూ అది యేమీ దొంగతనం చేయలేదు నాకు తెలిసి. అదే విషయం మీ ఆవిడ కూడా చెప్పింది.

నేను బట్టలేసుకుని బయటకొచ్చాను.

పల్లంరాజు కాస్త తుంటరిరకం. ఏమనుకున్నాడో యేమో అరుగుపక్కనున్న యిటిక రాయితో నూటిగా కుక్కను కొట్టడం, అది బాధతో అరుస్తూ, ఏడుస్తూ, వెళ్లి

పోవడం జరిగిపోయింది.

★ ★ ★

యూనియన్ నాయకత్వంమంటే చుట్టూ కావలిసినంత కిక్కు. కనిపించని గ్లామర్.

పందిని నందిని చెయ్యాలి. పాలని నీళ్లు చెయ్యాలి. అటువంటి ట్రిక్కులు చెయ్యగలవాడే యూనియన్ నాయకుడిగా ఎదగ్గలడు.

ఎలాగైతేనేం పోలీసుస్టేషన్లో పనులు మా వాళ్లకి అనుకూలంగా చక్కబెట్టి స్కూటర్ స్టార్ చేశాను. అసలుదొంగలు మా యూనియన్ వాళ్లే. కానీ వాళ్లే దొంగలంటే ఉద్యోగాలు ఊడతాయి.

మా యూనియన్ పరువు పోవడమేకాక వాళ్లని దొంగలుగా అప్పగిస్తే నా నాయకత్వం నట్టేట్లో కలుస్తుంది. యుక్తిగా వాళ్లను తప్పించగలిగితేనే నాకు నా యూనియన్ కార్మికులు నా ఎదుట కుక్కల్లా తోక ఊపుకుంటూ పడి ఉంటారు.

రేపు నేను డివిజనల్ నాయకుణ్ణి!

ఎల్లుండి రీజియన్ నాయకుణ్ణి!

మేనేజ్‌మెంటు నేనంటే హడలెత్తుతుంది!

పరపతీ, పలుకుబడీ, హైలెవెల్లో గౌరవం!

"ప్రతాప్‌గారూ! మీది బుర్రకాదండి బాబో" అన్నాడు హెడ్‌కానిస్టేబుల్.

"అవును హెచ్‌సీగారూ! మరి మావాళ్ళు ఫ్యాక్టరీ స్టోర్ రూం కప్పలు బద్దలు కొట్టి దొంగతనం చేసారే అనుకోండి. అదే అలాగే వొప్పుకుంటే ఇక నేను యూనియన్ లీడరయ్యే కంటే మా ఊర్లో గేదెలు కాసుకోవడం నయం"

పోలీసు స్టేషన్ నవ్వుల బాంబుల్తో ఊగిపోయింది కాస్సేపు.

"అందుకే దొంగతనం చేసి చోరీ సొత్తుతో పారిపోతుంటే మా వాళ్లు తమ ప్రాణాలను లెక్క చేయకుండా దొంగల్ని వెంబడించి ఫ్యాక్టరీ సొత్తును కాపాడితే, మేనేజ్‌మెంటు సెక్యూరిటీని తన వైపునకు తిప్పుకుని, పాతకక్షలతో వీళ్లమీద చోరీ కేసు నెత్తిన రుద్దుతుందా?" అన్నాను నేను కేసుని మలుపు తిప్పిన ధోరణిని వ్యంగ్యంగా విడమర్చుతూ.

యూనియన్ నాయకునిగా నాకు రాబోయే గుర్తింపుకి ఉబ్బితబ్బిబ్బయి యిల్లు చేరాను. ఇంటిగేటు దగ్గర స్కూటర్ పార్క్ చేశాను. హీరోలా లోపలికొచ్చాను.

మా అమ్మాయి ప్రజ్వల స్కూల్ బేగ్ అక్కడే ఉంది. నాన్నా అంటూ నన్ను అంటిపెట్టుకునే నా కూతురు అలికిడి యింట్లో లేదు.

"అమ్మాయేది" అడిగాను.

"అలా ఎక్కడికో వెళ్లుంటాది ఆడుకోడానికి"

నాకు అలసటగా ఉంది. చెమట షర్టు తీసేసి గదిలో కెళ్ళబోతూంటే కుక్క అదోలా మొరుగుతోంది. దాని ఎములను విరగదన్నాలన్నంత కోపం.

అటు చూశాను. అది నూతి గట్టు మీదికి ఎగురుతూ మొరుగుతోంది ఆందోళనగా.

అదెందుకలా చేస్తుందో తెలీలేదు.

నూతి దగ్గరకెళ్ళి లోపలికి చూశాను.

గుండె జల్లుమంది.

నీటిలో మా అమ్మాయి తల కిందికీ పైకీ కొట్టుకుంటోంది.

నేను భయంతో మా ఆవిణ్ని కేకేస్తూ, గబుక్కున నూతిలో దూకాను.

అబ్బ- నా కూతుర్ని మొత్తం మీద బతికించుకున్నాను. అయితే బతికించింది నేనా? లేక నేను నా వాకిట్లోంచి తరిమేశే కుక్కా?

డిపార్ట్‌మెంటులో పనిచేస్తున్నాను. అది యిచ్చే వేలాది రూపాయలు జీతంగా తీసుకుంటున్నాను. డిపార్ట్‌మెంట్ వర్కర్స్‌గా తిరిగి ఆ యింట్లోనే కన్నం వేసిన ఆ దొంగల్ని నిర్దోషులుగా బయటకు తెచ్చిన బాధ్యతాయుతమైన ఓ రికగ్నైజ్డ్ యూనియన్‌కి నాయకుణ్ణి.

తిన్న యింటికే కన్నం వేసిన కుసంస్కారం!- ఛీ ఛీ-

నా ఎదురుగా నేను అసహ్యించుకునే కుక్క-

అది నా కళ్లల్లోకి చూస్తోంది. ఇప్పుడు నాకు దాని ముఖం చూడడానికి సిగ్గేస్తోంది.

**-జి.నరసింహమూర్తి (మలికిపురం)**

# తృప్తి

"ఈరోడ్డంతా కొట్టిన పిండే ఎక్కడ గోతులున్నాయో, ఎక్కడ మలుపులున్నాయో తనిట్టే చెప్పేయగలడు. ట్రాఫిక్ సిగ్నల్స్‌తో పనే లేదు. అయితే..కళ్ల మీదకు నిద్ర ముంచుకొస్తోంది. ఈ పరిస్థితుల్లో..వాహనం అదుపు తప్పితే.."

డ్రైవింగ్ సీట్లో కూర్చున్న మునిరాజు ఆలోచనలో పడ్డాడు. ఆర్టీసీ డ్రైవరుగా అతనికి మంచి పేరుంది. వాహనాన్ని వేగంగా నడపటమేకాదు ప్రమాద రహితంగా ప్రయాణికుల్ని గమ్యానికి చేరుస్తాడన్న ప్రశంసలు అందుకున్నాడు ఎన్నోసార్లు.

"నేను ఈ ఉద్యోగంలో సంపాదించిందేమీ లేదు. అల్మరాలో కనిపిస్తున్న ఈ షీల్డులు తప్ప" -గర్వంగా, సంతృప్తిగా చెప్పుకుంటుంటాడు మునిరాజు. తనింటికి వచ్చే అతిథులకు వాటి పూర్వాపరాలు వివరిస్తుంటాడు. అల్మరాలో వరుసగా పేర్చి ఉన్న ఆ షీల్డుల్ని కృతజ్ఞతా పూర్వకంగా చూసుకున్నాకే-మునిరాజు ప్రతిరోజూ విధులకు హాజరవుతాడు. అవి అతనిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచటమే కాదు, బాధ్యతను గుర్తు చేస్తుంటాయి.

ముందు రోజు రాత్రి నైట్ డ్యూటీ చేసి ఇంటికెళ్లాడు. పండక్కి కూతురు, అల్లుడు, పిల్లలతో వచ్చారు. పగలంతా వాళ్లతో సరదాగా గడిచిపోయింది. ఒక్క క్షణం కంటిమీద కునుకులేదు. మళ్లీ ఈరోజు నైట్ డ్యూటీ..స్టాఫ్ ఎక్కువ మంది సెలవులో ఉన్నారు. తనడిగితే సూపరింటెండెంట్ నుంచి అదే సమాధానం వస్తుంది. అడిగి లేదనిపించుకోవటం దేనికని మళ్లీ డ్యూటీకొచ్చాడు.

చాలా ఇబ్బందిగా ఉంది. ముందుస్టాప్‌లో చన్నీళ్లతో మొహం కడుక్కున్నాడు. టీ కూడా తాగాడు. పండగ పిండి వంటలు బాగా లాగించటం వల్లనేమో కడుపు బరువు ఎక్కింది. కళ్లు కూడా మూత పడుతున్నాయ్!

"ఏయ్!" అన్న అరుపుతో ఆలోచనల్లోంచి బయటపడిన మునిరాజు-ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యాడు. ఎదురుగా వేగంగా వస్తున్న లారీ. రెప్పపాటులో బస్సును పక్కకు తిప్పాడు. ప్రమాదం తప్పింది.

'తనవే కాదు బస్సులో ఉన్న 50 మంది ప్రాణాలకు తను జవాబుదారి'- ఆ విషయం తనకు తెలుసు. తనను హెచ్చరించిన ముందుసీట్లో అతను అంటున్నాడు కోపంగా.

"కొంచెం ఉంటే అందరూ చచ్చుండేం వాళ్లం. బండి కాస్త జాగ్రత్తగా తోలు" అతని అరుపులకు గాఢనిద్రలో ఉన్న వాళ్లంతా లేచినట్టున్నారు. ఒక్కొక్కళ్లు-ఒక్కో రకమైన వ్యాఖ్యాన్యాలు చేయటం ప్రారంభించారు.

"నైట్ డ్యూటీ అనగానే ముందు నిద్రపోయి..మనసంతా ప్రశాంతంగా పెట్టుకుని రావాలన్న స్పృహ ఉండదండీ. పగలంతా పేకాటలు, తిరుగుళ్లు"

"మందుకొట్టి కూడా కొందరు డ్రైవింగ్ చేస్తుంటారట. మొన్నామధ్య మా బామ్మర్ది చెబుతున్నాడు.."

"ఎప్పుడెప్పుడు ఇంటి కెళదామా అన్న ఆత్రుత తప్ప..ప్రయాణికుల క్షేమం గురించి వీళ్లకు పట్టదండీ"

అవన్నీ మునిరాజు చెవుల్లో పడుతున్నాయ్! పేకాట, తాగుడు వంటి వ్యసనాలు తనకి లేవని ఎలా చెప్పగలడు.

స్టీరింగ్ మీద నుంచి చెయ్యి జారిపోతోంది.

కళ్లు వా..లి..పో..తు..న్నా..య్!

"మునిరాజు లే!" ఎవరో పిలుపుతో కళ్లు తెరిచాడు. ఎదురుగా ఆఫీసు వాళ్లు. సూపరింటెండెంట్ చెబుతున్నాడు-

"ఆరోగ్యం బాలేకపోతే సెలవుపెట్టచ్చు కదా! అనవసరంగా ఇబ్బంది పడ్డావ్! ఈసారీ ఉత్తమ డ్రైవర్ అవార్డు నీకే ప్రకటించారయ్యా!" అవేమీ వినబడటం లేదు.

"ఇంతకీ బస్సు ఏమైనట్టూ?"

మునిరాజు సందేహాన్ని తీర్చటానికి అన్నట్టు..సూపరింటెండెంటు చెప్పుకు పోయాడు. "ప్రయాణీకులందరినీ క్షేమంగా చేర్చారు. నువ్వు స్టీరింగ్ మీద తలవాల్చటం చూసి..నీ పక్క సీటతను..బస్సును కంట్రోల్ చేసి..రోడ్డు పక్కన ఆపాడు. ఆ తర్వాత డిపోనుంచి వేరే డ్రైవర్‌ను పంపి.."

హమ్మయ్య! తృప్తిగా నిట్టూర్చాడు మునిరాజు. ఆరోజు తనకి ఉత్తమ డ్రైవర్ బహుమతి ప్రకటించినందు కంటే ప్రయాణీకులు క్షేమం అన్న వార్తే ఎక్కువ సంతృప్తినిచ్చింది.

**-శ్రీసాయిపల్లవి (అనంతపురం)**